సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం। 15। సెప్టెంబర్। 2023



మట్టి వినాయకులను పూజిద్దాం

సిరిసిల్ల: పర్యావరణహితమైన మట్టి వినాయకులను పూజిద్దామని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్ కోరారు. కాలుష్యనియంత్రణ మండలి రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.



పారదర్శకంగా వైద్యసేవలు

సిరిసిల్లటౌన్: పారదర్శకంగా వైద్యసేవలందించాలని డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు కోరారు. గురువారం జిల్లాలోని వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు.

గరిష్టం/కనిష్టం
28.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడ స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

కృతజ్ఞత సభను విజయవంతం చేయండి

- టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు



గంభీరావుపేట(సిరిసిల్ల): మెడికల్ కాలేజీని ప్రారంభిస్తున్న సందర్భంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న సీఎం కేసీఆర్ కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు కోరారు. గంభీరావుపేటలో గురువారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, సెస్ డైరెక్టర్ గొరిసేని నారాయణరావు, ఏఎంసీ చైర్మన్ హన్మంతరెడ్డి, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ రాజేందర్, యువజన విభాగం మండల కన్వీనర్ రత్నాకర్ పాల్గొన్నారు.

వైద్యకళాశాల సాకారం

- నేడు సిరిసిల్లలో మెడికల్ కాలేజీ ప్రారంభం
- వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- వైద్య కళాశాలలో చేరిన 90 మంది విద్యార్థులు
- నియమితులైన వంద మంది వైద్యులు

సిరిసిల్ల: సిరిసిల్ల.. ఇది కార్మిక క్షేత్రం. 2014 వరకు సరైన వైద్య సదుపాయాలు.. మంచి ఆస్పత్రి వసతి కూడా లేని ఓ పట్టణం. ఇంటర్ విద్యనే ఇక్కడ పెద్ద చదువు. అలాంటి సిరిసిల్ల ఇప్పుడు జిల్లా కేంద్రంగా భాసిల్లుతోంది. డిగ్రీ కాలేజీ కూడా లేని సిరిసిల్లలో ఏకంగా మెడికల్ కాలేజీ కల నెరవేరబోతుంది. జిల్లా కేంద్రంలో శుక్రవారం మెడికల్ కాలేజీని రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.

36 ఎకరాల్లో.. రూ.39 కోట్లతో..

జిల్లా కేంద్రం శివారులోని పెద్దూరు బైపాస్‌రోడ్డులో 36 ఎకరాల్లో రూ.39కోట్లతో మెడికల్ కాలేజీ భవనం నాలుగు అంతస్తుల్లో నిర్మితమైంది. ప్రతి ఫోర్‌లోని నాలుగు బ్లాక్‌లు ఉన్నాయి. సర్ధాపూర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీలో హాస్టల్ వసతి కల్పించారు. మెడికల్ కాలేజీలో ఇప్పటికే 90 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. వంద మంది వైద్యులు, ఇందులో 50 మంది ఫ్యాకల్టీలు, 38 మంది సీనియర్ రెసిడెంట్ వైద్యులు, మరో 12 మంది ఐసీయూ వైద్యులు విధుల్లో చేరారు. నాన్‌టీచింగ్ స్టాఫ్ మరో 250 మంది ఉన్నారు.

మంత్రి కేటీఆర్ చొరవతో..
సీఎం కేసీఆర్ ప్రకటన

జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు చేయించడంలో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు సఫలీకృతులయ్యారు. 2021 జూలై 4న సీఎం కేసీఆర్ సిరిసిల్లకు మెడికల్ కాలేజీని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈమేరకు మెడికల్ కాలేజీని మంజూరుచేస్తూ నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) న్యూఢిల్లీ లెటర్ ఆఫ్ ఇన్‌టెంట్(ఎల్‌వోటీ)ను జారీ చేసింది. కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జిల్లా మెడికల్ కాలేజీకి వంద ఎంబీబీఎస్ సీట్లను కేటాయించారు. దీనికి అనుగుణంగా నేషనల్ మెడికల్ కమిషన్ ఆదేశాలు జారీచేసింది. మంత్రి కేటీఆర్ చొరవతో మెడికల్ కాలేజీ భవనం పూర్తయింది.

ఈ ఏడాది వంద సీట్లు

మెడికల్ కాలేజీలో మొదటి ఏడాది వంద సీట్లు కేటాయించారు. ఇందులో 15 సీట్లు ఆలిండియా కోటాలో, మరో 85 సీట్లు రాష్ట్ర స్థాయి అభ్యర్థులకు కేటాయించారు. ఇప్పటికే 90 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. మరో పది మంది చేరాల్సి ఉంది. త్వరలో వైద్యవిద్య బోధన తరగతులు ప్రారంభంకానున్నాయి. సిరిసిల్ల జిల్లా ఆస్పత్రిలో మొత్తం 340 బెడ్స్‌ను సిద్ధం చేశారు. పెద్దూరు వద్ద నిర్మించిన సొంత భవనంలోనే తరగతులు ప్రారంభిస్తారు. హాస్టల్‌కు అద్దె భవనాలను సిద్ధం చేశారు.



మెడికల్ కాలేజీ భవనం

ఇటీవల రాష్ట్ర వైద్య విద్యాసంచాలకులు డాక్టర్ రమేశ్‌రెడ్డి సిరిసిల్ల మెడికల్ కాలేజీని సందర్శించారు.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

మెడికల్ కాలేజీ ప్రారంభంతో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు జరగనున్నాయి. సిరిసిల్లలోని జిల్లా ఆస్పత్రిని పూర్తిస్థాయిలో మాత, శిశు సంరక్షణ, నవజాత శిశువుల కేంద్రంగా మారుతుంది. 340 బెడ్స్‌తో ప్రసూతి విభాగం అవుతుంది. ఇప్పటికే ప్రతి నెలా 360 డెలివరీలతో సిరిసిల్ల జిల్లా ఆస్పత్రి అద్భుతమైన ప్రసూతి సేవలను అందిస్తుంది. జనరల్ ఆస్పత్రి మొత్తంగా మెడికల్ కాలేజీకి మార్చడంతో పెద్దూరు శివారులోని మెడికల్ కాలేజీ బోధనాస్పత్రిగా ఉంటుంది. అన్ని రకాల వైద్యసేవలు, ఆధునిక పరికరాలతో అందుబాటులోకి వస్తుంది. జిల్లా ప్రజలకు ఉచిత వైద్యసేవలు 24 గంటల బోధనాస్పత్రిలో అందుతాయి. ఏ ప్రైవేటు ఆస్పత్రిలో లేని విధంగా అన్ని రకాల వైద్యులు అందుబాటులో ఉంటారు.



మెడికల్ కాలేజీలోని ఏర్పాట్లు

క్లుప్తంగా

కార్యకర్తలే పార్టీకి బలం



బోయినపల్లి(చొప్పదండి): కార్యకర్తలే బీఆర్ఎస్‌కు బలమని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మండలంలోని మర్ల పేటకు చెందిన సుమారు పది మంది యువకులు ఎమ్మెల్యే సమక్షంలో గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. కండువా కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. మండల కో–ఆప్షన్ సభ్యుడు మహ్మద్ అజ్జు, కంకనాల పురుషోత్తంరెడ్డి తదితరులు ఉన్నారు.

కొత్తపల్లివాసికి డాక్టరేట్



గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని కొత్త పల్లికి చెందిన మ్యాడ వంశీధర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను అందించింది. వాణిజ్య విభాగంలో ఓయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి శ్రీనివాస్ పర్యవేక్షణలో వంశీధర్ వ్యవసాయంలో కలిగే నష్టాలు, నివారణ వ్యూహాలపై పరిశోధన చేసి నివేదికలు సమర్పించారు. దీనికి యూనివర్సిటీ వంశీధర్‌కు పీహెచ్‌డీ పట్టా అందించింది.

డ్రైవింగ్ లైసెన్సుల కోసం ఠాణాకు క్యూ..



తంగళ్లపల్లి(సిరిసిల్ల): డ్రైవింగ్ లైసెన్సుల కోసం పలువురు తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌కు క్యూ కడుతున్నారు. దీనిపై ఎస్సై వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రైవింగ్ లైసెన్సు లేని యువకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో ఆర్టీవో అధికారులతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి లైసెన్సులు ఇవ్వనున్నట్లు చెప్పారు.

వైన్స్‌షాపులో చోరీ

ముస్తాబాద్(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి బైపాస్‌లో ఉన్న శివ వైన్స్‌లో గురువారం తెల్లవారుజామున దొంగలు పడ్డారు. వైన్స్ వెనుకగల తలుపులను వ్యక్తులు బద్దలుకొట్టి, కౌంటర్‌లోని రూ.10వేలు ఎత్తుకెళ్లారు. వైన్స్ యజమాని యాదగిరిరెడ్డి ఫిర్యాదుతో విచారణ చేపడుతున్నారు.

డీజే శబ్దంతో ఆగిన గుండె

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్లలో డీజే శబ్దంతో ఒకరి గుండె ఆగింది. స్థానిక ప్రగతినగర్‌కు చెందిన బొల్లి సత్యనారాయణ(44) సొంచాలు నడుపుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం రాత్రి వారి ఇంటి ముందు నుంచి ఊరేగింపుగా డీజే వాహనం వెళ్లింది. ఒక్కసారిగా భారీ శబ్దం రావడంతో గుండె దడతో సత్యనారాయణ కుప్పకూలిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య ఉమారాణి, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

దుబాయి నుంచి వచ్చి.. భార్య ప్రియుడిని చంపి..

- రాజన్న సిరిసిల్ల జిల్లాలో యువకుడి దారుణ హత్య
- నిందితుల కోసం ముమ్మర గాలింపు
- లుక్‌ఔట్ నోటీస్ జారీ చేసిన పోలీసులు
- మల్యాలలో విషాదం



పడిగెల నరేశ్(ఫైల్)

చందుర్తి(వేములవాడ): భార్యతో వివాహేతర సంబంధం నెరుపుతున్నాడని తెలుసుకున్న భర్త దుబాయి నుంచి వచ్చి యువకుడిని హత్య చేశాడు. ఈ సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మల్యాలలో సంచలనం సృష్టించింది. గ్రామస్తులు, చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాలు. మల్యాలకు చెందిన పడిగెల నరేశ్(27) అదే గ్రామానికి చెందిన వివాహిత(32)తో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం తెలిసిన వివాహిత బావ కుమారుడు లక్ష్మణ్ దుబాయ్‌లో ఉంటున్న ఆమె భర్త మల్లేశంకు తెలిపాడు. ఈనెల 3వ తేదీన గల్ఫ్ నుంచి వచ్చిన మల్లేశం ఇంటికిరాకుండా ఎక్కడో తలదాచుకున్నాడు. నరేశ్‌ను చంపేందుకు అదును కోసం ఎదురుచూస్తున్నాడు. బుధవారం రాత్రి నరేశ్ సదరు వివాహిత ఇంట్లోకి వెళ్లడం గమనించిన బావ కొడుకు లక్ష్మణ్ ఆమె భర్త మల్లేశంకు సమాచారం అందించాడు. మల్లేశం మాస్కులు ధరించి బైక్‌పై ఇంటికి చేరుకుని.. భార్యతో ఇంట్లో ఉన్న యువకుడిపై కత్తితో దాడి చేశాడు. మంచం పై నుంచి కింద పడ్డ నరేశ్‌పై పదే..పదే కత్తితో దాడి చేయగా తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే హత్యకు పాల్పడ్డ వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. హత్య విషయం తెలుసుకున్న చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, పలువురు ఎస్సైలు బుధవారం అర్ధరాత్రి ఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపించారు. మల్లేశం కోసం పరిసర ప్రాంతాల్లో గాలించారు. హత్య జరిగేందుకు మరో నలుగురు సహకరించారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి గురువారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. మృతుని తల్లి లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ వివరించారు.



రోదిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

సాయంత్రం విందు...అర్ధరాత్రి హత్య

పడిగెల నరేశ్‌కు అదే గ్రామానికి చెందిన వివాహితతో ఐదేళ్ల క్రితమే వివాహేతర సంబంధం ఏర్పడింది. అదే సమయంలో వివాహిత కుటుంబ సభ్యులకు, యువకుడి మధ్య గొడవలు జరగడంతో నరేశ్ దుబాయి వెళ్లాడు. అక్కడే ఐదేళ్లపాటు ఉన్నాడు. గత ఆగస్టు 29న ఇంటికొచ్చిన నరేశ్ తిరిగి ఆ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించాడు. ఇది గమనించిన వివాహిత భర్త అన్నలతోపాటు వారి కుమారుడు ఈ విషయాన్ని గల్ఫ్‌లో ఉంటున్న మల్లేశంకు తెలిపారు. ఈనెల 3న దుబాయి నుంచి ఇండియా వచ్చిన మల్లేశం బంధువుల ఇంట్లో తలదాచుకున్నాడు. ముందస్తు పథకం ప్రకారం వివాహిత కుటుంబ సభ్యులు బుధవారం సాయంత్రం యువకుడి ఇంట్లోనే విందు చేసుకున్నారు. తర్వాత యథావిధిగా ఎవరి ఇంటికి వారు వెళ్లిపోయారు. బంధువుల ఇంట్లో తలదాచుకున్న మల్లేశంను అదే సమయంలో స్వగ్రామానికి పిలిపించుకున్నారు. ఇది తెలియని యువకుడు రాత్రి అందరూ పడుకున్న సమయంలో వివాహిత వద్దకు వెళ్లాడు. గమనించిన లక్ష్మణ్ తన చిన్నాన్న మల్లేశంకు ఫోన్ చేయడంతో బైక్‌పై వచ్చి యువకుడిని హత్య చేశాడు.



హత్య జరిగిన తీరును డీఎస్పీకి వివరిస్తున్న సీఐ

అనుమానితులను విచారిస్తున్న పోలీసులు

ఈ హత్యలో ప్రధాన నిందితుడిగా ఉన్న మల్లేశం పరారీకాగా.. అనుమానం ఉన్న ముగ్గురితోపాటు వివాహితను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. హత్యకు సహకరించిన వారి వివరాలను కాల్‌డాటా ఆధారంగా సేకరిస్తున్నట్లు సమాచారం. వారం క్రితమే హత్యకు పథకం రచించినట్లు తెలిసింది.

పోలీసుల లుక్‌ఔట్ నోటీసు

యువకుని హత్యలో ప్రధాన నిందితునిగా భావిస్తున్న మల్లేశం దుబాయి నుంచి ఈనెల 3న ఇండియాకు వచ్చాడు. హత్య చేసేందుకు ముందుగానే తిరిగి దుబాయి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలిసింది. రాత్రి 11 గంటల ప్రాంతంలో నరేశ్‌ను హత్యచేసి ఎయిర్‌పోర్టుకు అదే రాత్రి వెళ్లిపోయాడన్న ప్రచారంతో పోలీసులు లుక్‌ఔట్ నోటీస్ జారీ చేసినట్లు తెలిసింది.

కార్మికక్షేత్రం గులాబీమయం

- నేడు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞత సభ
- మూడు దారుల్లో ర్యాలీలు
- అంబేడ్కర్ కూడలి వద్ద సభ
- పాల్గొంటున్న మంత్రి కేటీఆర్

సిరిసిల్ల: జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు కృతజ్ఞత తెలిపేందుకు జిల్లా కేంద్రం నడిబొడ్డున శుక్రవారం భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. సీఎం కేసీఆర్ వర్చువల్ విధానంలో హైదరాబాద్ నుంచే మెడికల్ కాలేజీని ప్రారంభిస్తారు. రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు కాలేజీ భవనాన్ని ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా సీఎంకు కృతజ్ఞతలు తెలిపేందుకు జిల్లాలోని నలుమూలల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు తరలిరానున్నాయి. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ప్రజలను ఉద్దేశించి మంత్రి కేటీఆర్ మాట్లాడుతారు.

గులాబీమయమైన కూడళ్లు

జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లు గులాబీ జెండాలతో నిండిపోయాయి. శుక్రవారం నిర్వహించే ర్యాలీకి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, వీర్నపల్లి మండలాల నుంచి వచ్చే బీఆర్ఎస్ శ్రేణులు కొత్త బస్టాండు నుంచి ర్యాలీగా అంబేడ్కర్ సర్కిల్‌కు చేరుకుంటారు. వేములవాడ, కోనరావుపేట, చందుర్తి, బోయినపల్లి ప్రాంతాల నుంచి వచ్చే వారు కొత్తచెరువు కట్ట వద్ద వాహనాలు పార్కింగ్ చేసి ర్యాలీగా అంబేడ్కర్ సర్కిల్‌కు చేరుకుంటారు. ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాల నుంచి వచ్చే వారు విద్యానగర్ సర్కిల్, బతుకమ్మఘాట్ వద్ద వాహనాలు పార్కింగ్ చేసి ×సెస్॰ ఆఫీస్ నుంచి ర్యాలీగా చేరుకునేలా ప్రణాళిక రూపొందించారు. మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు చేరుకుని, సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రసంగిస్తారు. ఈమేరకు సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతోపాటు అన్ని గ్రామాల నుంచి ప్రజలను, బీఆర్ఎస్ శ్రేణులను తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.



ముస్తాబైన గాంధీచౌక్

‘టెట్’కు ఏర్పాట్లు

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలో శుక్రవారం నిర్వహించే టెట్ పరీక్షకు 15 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాధికారి రమేశ్ తెలిపారు. ఈనెల 15న ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో పేపర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి పేపర్‌కు 3,378, రెండో పేపర్‌కు 2,937 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు వివరించారు. హాల్‌టికెట్లలో తప్పులుంటే జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సరైన పత్రాలతో వచ్చి సవరించుకోవాలని సూచించారు. సూపరింటెండెంట్లు 60, ఇన్విజిలేటర్లు 150 మంది విధుల్లో ఉంటున్నట్లు వివరించారు.



ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

సఖీ కేంద్రంలో 856 కేసులు

సిరిసిల్లకల్చరల్: బాధిత మహిళలకు సత్వర న్యాయం జరిగేందుకు జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సఖీ కేంద్రంలో ఇప్పటి వరకు 856 కేసులు నమోదైనట్లు జిల్లా సంక్షేమాధికారి పి.లక్ష్మీరాజం తెలిపారు. సఖీ కేంద్రాన్ని గురువారం సందర్శించి బాధిత మహిళలకు అందుతున్న సేవలను సమీక్షించారు. త్వరగా సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గృహహింస 470, వరకట్న వేధింపులు 60, పోక్సో 78, మిస్సింగ్, కిడ్నాప్ 44, ప్రేమ పేరిట మోసాలు 36, వయోవృద్ధులు 32 ఇతరత్ర 136 కేసులు నమోదైనట్లు వివరించారు. ఇప్పటి వరకు 424 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. సుమారు 21 మంది ట్రాన్స్‌జెండర్లకు ఓటర్ గుర్తింపుకార్డులను మంజూరు చేసినట్లు చెప్పారు. సఖీ సపోర్ట్ ఏజెన్సీ భూమిక ఉమెన్స్ కలెక్టివ్ చీఫ్ ఫంక్షనరీ కొండవీటి సత్యవతి, అడ్మినిస్ట్రేటర్ పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.



సఖీ కేంద్రంలో సమీక్షిస్తున్న డీడబ్ల్యూవో లక్ష్మీరాజం

సిరిసిల్లలో ట్రాఫిక్ ఆంక్షలు

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: జిల్లా కేంద్రంలో పబ్లిక్ మీటింగ్ ఉన్నందున ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లను గురువారం పరిశీలించి మాట్లాడారు. టెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు నిర్ణీత సమయాని కంటే గంట ముందుగానే పరీక్ష కేంద్రాలను చేరుకోవాలన్నారు. మొదటి పరీక్ష అయిన తర్వాత కేంద్రాలకు దూరంగా వెళ్లొద్దని సూచించారు. కృతజ్ఞత ర్యాలీకి హాజరయ్యే ప్రజలకు పలు సూచనలు చేశారు.

- ఎల్లారెడ్డిపేట నుంచి మీటింగ్‌కు వచ్చే ప్రజలు కొత్త బస్టాండ్ ప్రాంతంలో వాహనాలు నిలిపివేయాలని సూచించారు.
- వేములవాడ, రగుడు మార్గం నుంచి వచ్చే వారు చంద్రంపేట కళ్యాణలక్ష్మి గార్డెన్ వద్ద వాహనాలు నిలిపివేయాలన్నారు.
- తంగళ్లపల్లి రూట్ నుంచి వచ్చే వారు పద్మనాయక ఫంక్షన్‌హాల్ లేదా బతుకమ్మఘాట్ వద్ద పార్కింగ్ ప్లేస్‌లో వాహనాలను పార్కింగ్ చేయాలని సూచించారు.
- రగుడు నుంచి వెంకటాపూర్ బైపాస్‌మార్గం, రగుడు నుంచి తంగళ్లపల్లి బైపాస్‌రోడ్డుపై యథావిధిగా ప్రయాణాలు చేసుకోవచ్చని తెలిపారు.



సిరిసిల్ల ట్రాఫిక్ మళ్లింపుపై పర్యవేక్షిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సోనియాగాంధీ సభను విజయవంతం చేయండి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్

వేములవాడ: అమరుల త్యాగాలకు చలించిన సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చిందని.. అయితే స్వరాష్ట్రంలో ప్రజల జీవనంలో ఎలాంటి మార్పు రాలేదని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడుగు గంగాధర్, జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడలోని మహాలింగేశ్వర ఫంక్షన్‌హాల్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఈనెల 17న సోనియాగాంధీ తుక్కుగూడలో జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. కేసీఆర్ కుటుంబ పాలనను అంతమొందించాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. వేములవాడ అర్బన్, వేములవాడరూరల్, కోనరావుపేట, చందుర్తి మండలాల అధ్యక్షులు వకులాభరణం శ్రీనివాస్, పిల్లి కనకయ్య, షేక్ ఫిరోజ్‌పాషా, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న గంగాధర్

పట్టపగలు రెండిళ్లలో చోరీ

- 7 తులాల బంగారం, 8 తులాల వెండి మాయం

చందుర్తి(వేములవాడ): వ్యవసాయ పనులకు వెళ్లిన రెండిళ్ల తాళాలను పట్టపగలే పగులగొట్టి చోరీకి పాల్పడిన సంఘటన చందుర్తి మండలం మూడపల్లి అనుబంధ గ్రామం గోస్కులపల్లెలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు. గోస్కులపల్లెకు చెందిన రైతులు మర్రిపల్లి హన్మండ్లు, మర్రిపల్లి సత్తయ్య ఇంట్లో చొరబడి 7 తులాల బంగారం, 8 తులాల వెండి వస్తువులను, రూ.7వేల నగదు ఎత్తుకెళ్లారు. కాగా దొంగలను పట్టుకునేందుకు మూడపల్లి గ్రామపంచాయతీలో సీసీ ఫుటేజీల ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ఇద్దరు రైతులు దొంగతనం జరిగే సమయంలో ఇంటి వెనుకలో ఉన్న పత్తి చేనులోనే మందు పిచికారీ చేస్తున్నట్లు వాపోయారు.

స్వగ్రామం చేరిన మృతదేహం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని మండెపల్లికి చెందిన లింగం పర్శరాములు(38) ఇటీవల దుబాయిలో గుండెపోటుతో మృతిచెందాడు. కాగా గురువారం పర్శరాములు మృతదేహం స్వగ్రామం చేరుకుంది.

పేకాటరాయుళ్ల పట్టివేత

కోనరావుపేట: నిజామాబాద్ సమీపంలోని కోళ్ల ఫారంలో పేకాటాడుతున్న ఐదుగురిని పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.6,400 నగదు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

మోహినికుంట జిల్లాకే ఆదర్శం

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శంకరయ్య

ముస్తాబాద్(సిరిసిల్ల): అభివృద్ధి, సంక్షేమంలో మోహినికుంట జిల్లాకే ఆదర్శంగా నిలుస్తుందని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఆకునూరి శంకరయ్య కొనియాడారు. మోహినికుంట గ్రామాన్ని గురువారం సందర్శించిన శంకరయ్య నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని పరిశీలించి మాట్లాడారు. త్వరలోనే మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా గ్రంథాలయాన్ని ప్రారంభించుకోనున్నట్లు తెలిపారు. సర్పంచ్ వనజ, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు గోపాల్‌రావు చేసిన పనులను పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో గోదాం, సీసీరోడ్లు, డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు, మహిళా భవనం, ఓపెన్ జిమ్, రూ.2 కోట్లతో నిర్మించే ఫంక్షన్‌హాల్, సంచార జీవుల కోసం నిర్మించిన కాలనీ, చెక్‌డ్యామ్, శ్మశానవాటిక, ఆలయాల అభివృద్ధి, ఇంటికో ఇంకుడు గుంత వంటి పనులు బాగున్నాయన్నారు. గంగాదేవిపల్లెకు మిన్నగా ఇక్కడ అభివృద్ధి చేశారని కితాబునిచ్చారు. రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు గోపాల్‌రావు, గ్రంథాలయసంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డి, నాయకులు కల్వకుంట్ల శ్రీనివాస్‌రావు, సతీశ్, కొండ శ్రీను, మనోహర్, స్వామి, దేవయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



లైబ్రరీని పరిశీలిస్తున్న జిల్లా చైర్మన్ శంకరయ్య

‘మల్కపేట’కు కర్రోల్ల నర్సయ్య పేరు పెట్టాలి



కర్రోళ్ల నర్సయ్య పేరు పెట్టాలని ఫ్లెక్సీ ప్రదర్శిస్తున్న నాయకులు

వేములవాడ: కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్‌కు మాజీ ఎమ్మెల్యే కర్రోళ్ల నర్సయ్య పేరు పెట్టాలని స్థానిక తెలంగాణచౌక్‌లో భీమ్‌ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఫ్లెక్సీ ప్రదర్శించారు. ప్రవీణ్ మాట్లాడుతూ దళిత కుటుంబంలో పుట్టి నిజాం నిరంకుశత్వంపై పోరాడిన తెలంగాణ సాయుధ పోరాటయోధుడు కర్రోళ్ల నర్సయ్య అని గుర్తుచేశారు. భూమి కోసం, భుక్తి కోసం వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడారన్నారు. తన స్వగ్రామం మల్కపేటలో రిజర్వాయర్ కడుతున్నప్పుడు పోరాట చరిత్ర గల యోధున్ని మరిచి భూస్వాముల పేరు పెట్టడం సరికాదన్నారు. బీఎస్పీ నియోజకవర్గ కార్యదర్శి దొబ్బల నరేశ్, కర్రోళ్ల దేవరాజు, మల్లారపు ప్రశాంత్, అజయ్, దీపక్, మనోజ్, విక్రమ్ పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీలకు పురస్కారాలు






అవార్డులు అందుకుంటున్న నామాపూర్ సర్పంచ్ విజయ, వన్‌పల్లి సర్పంచ్ లత

ముస్తాబాద్/వీర్నపల్లి(సిరిసిల్ల): స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో రాష్ట్రస్థాయిలో జిల్లాలోని రెండు గ్రామ పంచాయతీలకు ఉత్తమ పురస్కారాలు దక్కాయి. ముస్తాబాద్ మండలం నామాపూర్, వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామాలు సంపూర్ణ పారిశుధ్యం నిర్వహణ, రక్షిత నీటి సరఫరా, తడి, పొడి చెత్త సేకరణ వంటి అంశాల్లో ఉత్తమంగా నిలిచాయి. ఆయా గ్రామాల సర్పంచులు వెల్ముల విజయ, జోగినిపల్లి లత హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. మండల అధికారులు, నాయకులు అభినందించారు.

సభా వేదిక మార్చాలి

- అభివృద్ధిని స్వాగతిస్తాం.. అవాంతరాలను సహించం
- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

సిరిసిల్లఎడ్యుకేషన్: ఉద్యోగార్థులు అనేక ఏళ్లుగా వేచి చూసిన టెట్ రోజునే పరీక్ష కేంద్రాలకు సమీపంలో బీఆర్ఎస్ సభావేదికను ఏర్పాటు చేయడం సరికాదని, వెంటనే వేదికను మార్చాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. మీడియాతో గురువారం మాట్లాడారు. టెట్ పరీక్షను సజావుగా నిర్వహించేందుకు జిల్లాలో 144 సెక్షన్ అమలు చేయాల్సిన అధికారులు.. సభకు అనుమతించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్ష రాసే అభ్యర్థులకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

అంతరాయం కలిగితే బాగోదు

టెట్ పరీక్ష హాజరయ్యే అభ్యర్థుల రాకపోకలకు, పరీక్ష రాసే సమయంలో ఇబ్బందులు కలిగితే సహించేది లేదని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్ పేర్కొన్నారు. సభను పరీక్ష కేంద్రాలకు సమీపంలో ఏర్పాటు చేయడం సరికాదన్నారు.

– రంజిత్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి





మెడికల్ కాలేజీ పరిశీలన

సిరిసిల్ల: జిల్లా మెడికల్ కాలేజీ భవనాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, కలెక్టర్ అనురాగ్ జయంతి వేర్వేరుగా గురువారం పరిశీలించారు. సీఎం కేసీఆర్ శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై ఆరా తీశారు. కలెక్టర్ అనురాగ్ జయంతి సర్దాపూర్‌లోని వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీ విద్యార్థుల వసతిగృహాన్ని పరిశీలించారు. అదనపు కలెక్టర్లు ఎన్.ఖీమ్యానాయక్, బి.గౌతమ్‌రెడ్డి, ‘సెస్’* చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా ఉద్యానవనాల అధికారి జ్యోతి, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, జిల్లా మత్స్యశాఖ అధికారి శివకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, సిరిసిల్ల తహసీల్దార్ ఎండీ షరీఫ్ మొహినొద్దీన్, స్థానిక కౌన్సిలర్ రెడ్డినాయక్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ బండ నర్సయ్యయాదవ్, కొలనూర్ పీఏసీఎస్ చైర్మన్ సంకినేని రామ్మోహన్‌రావు, బీఆర్ఎస్ నాయకుడు న్యాలకొండ రాఘవరెడ్డి, మంత్రి కేటీఆర్ వ్యక్తిగత కార్యదర్శి మహేందర్‌రెడ్డి, సిరిసిల్ల క్యాంప్ ఆఫీస్ ఇన్‌చార్జి గణరాజ్ ఉన్నారు.

రాజ్యాధికారం కోసం బహుజనులు ఉద్యమించాలి



మాట్లాడుతున్న స్వామి

ముస్తాబాద్(సిరిసిల్ల): రాజ్యాధికారం కోసం బహుజనులు ఐక్యంగా ఉద్యమించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వర్దెల్లి స్వామిగౌడ్ కోరారు. ఎల్లారెడ్డిపేట, సింగారం, బండలింగంపల్లి, గుండారం, తిమ్మాపూర్ గ్రామాల్లో బీఎస్పీ జెండా పండుగను గురువారం బైక్‌ర్యాలీ చేపట్టారు. స్వామిగౌడ్ మాట్లాడుతూ చట్టసభలకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను పంపినప్పుడే బహుజనుల హక్కులు సాధిస్తామన్నారు. జనాభాలో యాభైశాతం ఉన్న బహుజనులకు రాజ్యాధికారం లేకపోవడంతో అణచివేతకు గురవుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో బీఎస్పీని గెలిపించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి అంకని భాను, జిల్లా ఇన్‌చార్జి బట్టు రామచంద్రం, మహేందర్, రాజబాబు, అంజయ్య, మధుకర్, సందీప్, సంజీవ్, హైదర్, లక్ష్మీరాజం, చిరంజీవి, లక్ష్మణ్, లక్ష్మణ్‌గౌడ్, కిషన్, సాయి, శ్రీను, శేఖర్, సతీశ్ పాల్గొన్నారు.